క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలికలు కావ్య, ఝాన్సీ రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పిల్లి కమల్‌కిశోర్, హెచ్‌ఎం జానయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో బాలికలకు ప్రశంస పత్రాన్ని అందజేశారు.

'టీబీ ముక్త్ అభియాన్'లో భాగస్వాములు కావాలి

చిన్నగూడూరు: 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులతో టీబీ ముక్త్ అభియాన్ గురించి టాస్క్‌ఫోర్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ రజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, సీహెచ్‌ఓ వలీఉద్దీన్, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని ఏటిగడ్డ తండాకు చెందిన యువకుడు గడ్డి మందు తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటిగడ్డ తండాకు చెందిన బానోతు సిజ్జిరాం, వినోద దంపతులకు మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన కుమారుడు గణేష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా మారిందని వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న కండక్టర్ మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతూ ఆర్టీసీ బస్ కండక్టర్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రబెల్లిగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బిట్ల రమేష్ (40) తొర్రూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6న కడుపు నొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. మృతుడి భార్య బిట్ల శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూముల ఆక్రమణపై న్యాయ పోరాటం



డోర్నకల్: డోర్నకల్ అధ్యక్ష మండలానికి సంబంధించిన ఖరీదైన చర్చి భూముల ఆక్రమణపై న్యాయ పోరాటం చేస్తున్నామని డోర్నకల్ డయోసీస్ బిషప్ రెవ.డాక్టర్ కె.పద్మారావు పేర్కొన్నారు. స్థానిక బిషప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మాదిరిపురం శివారులోని మహ్మదాపురంలో చర్చి నాలుగెకరాల భూమిని నరెడ్డి వెంకటమ్మ, కరెడ్డి దామోదరెడ్డి పోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని పద్మారావు డిమాండ్ చేశారు.

చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో మంగళవారం రూ.1,75,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, వీరేందర్‌, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధిక ప్రయోజనం

గార్ల: నానో యూరియా వాడకంతో పంటలకు త్వరగా నత్రజని అందుతుందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ గోదాంలో నానో యూరియా వినియోగంపై రైతులకు వివరించారు.

జయప్రదం చేయాలి

మరిపెడ రూరల్: నేడు జరిగే సార్వత్రి సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, వెంకన్న, వీరేందర్, రషీద్ పాల్గొన్నారు.

అయోమయంలో జీపీఓలు?

- అర్హత సాధించి నెల దాటుతున్నా అందని నియామక పత్రాలు
- అర్హత సాధించిన జీపీఓలు 112మంది
- మిగిలిన వారి నియామకంపై ప్రభుత్వం తర్జనభర్జన



తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు (ఫైల్)

మహబూబాబాద్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం అమలు చేస్తోంది. దానిలో భాగంగా జీపీఓ (గ్రామ పరిపాలన అధికారులు)ల నియామకం చేపట్టింది. కాగా పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలు అవకాశం కల్పించగా ఆశించిన రీతిలో వారి నుంచి స్పందన రాలేదు. దీంతో ఆ పోస్టులకు ఖాళీల సమస్య ఎక్కువగా ఉంది. దీంతో మరోసారి పూర్వ వీఆర్వోలకు, వీఆర్‌ఏలకు అవకాశం ఇవ్వాలా లేదా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే విషయంలో తర్జనభర్జన చేస్తుంది. అర్హత సాధించిన జీపీఓల పరిస్థితి అయోమయంగా మారింది.

మే 25న జీపీఓలకు పరీక్ష

జిల్లాలో 418 వీఆర్‌ఏలు, 128మంది వీఆర్వోలు ఉన్నారు. కాగా వారిని 2022లో గత ప్రభుత్వం ధరణి మూలంగా వారిని పలుశాఖలలో సర్దుబాటు చేసిన విషయం విధితమే. కాగా జీపీఓల కోసం అవకాశం కల్పించగా వారిలో కేవలం 152మంది ఆప్షన్ పెట్టుకున్నారు. కాగా ఈ ఏడాది మేనెల 25వ తేదీన పరీక్ష నిర్వహించగా కేవలం 132మంది హాజరు కాగా వారిలో 112మంది అర్హత సాధించగా 20మంది ఫెయిల్ అయ్యారు.

మిగిలిన పోస్టుల భర్తీపై రాని స్పష్టత

ప్రభుత్వం పూర్వ వీఆర్వోల, వీఆర్‌ఏల ద్వారా జీపీఓల పోస్టు భర్తీ అవుతుందని ఆశించినా ఫలితం రాలేదు. దీంతో మళ్లీ వారికి అవకాశం కల్పించి పరీక్ష నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సంబంధిత అధికారులు అంటున్నారు. వారితో ఈ పోస్టుల భర్తీ చేస్తుందా లేదా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తుందా? అనే దానిపై స్పష్టత రాలేదు. అర్హత సాధించిన 112మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. వాస్తవానికి జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున జీపీఓల నియామకపత్రాలు ఇవ్వాల్సి ఉంది. కాని నేటికి నియామక పత్రాలు ఇవ్వలేదు. వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

బహిరంగసభకు తరలిన నాయకులు



బోనాలతో వస్తున్న మహిళలు



డప్పుచప్పుళ్లతో వస్తున్న కళాకారులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి జ్యోతిరావుపూలే సెంటర్ వద్ద ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన బహిరంగ సభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తోపాటు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రామచంద్రు నాయక్, కనకయ్య, ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హాజరయ్యారు. ఈమేరకు మహిళలు బోనాలను ఎత్తుకుని, కళాకారులు వేషధారణలతో నృత్యాలు చేస్తూ తరలివచ్చారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం సరికాదు



మాట్లాడుతున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

బయ్యారం: పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్‌ను దేవుడిగా భావించిన వారు పార్టీ మారగానే దయ్యంగా కనపడుతున్నారా.. అని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు ప్రశ్నించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తో అన్నిరకాలుగా ప్రయోజనం పొందిన వ్యక్తులు అధికారం పోగానే కాంగ్రెస్‌లో చేరి మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయటం సరికాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ రాష్ట్రంను సాధించిన కేసీఆర్‌ను కించపరిచే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడ తెలంగాణవాదులు ఖండించాలన్నారు. మున్నేరు నీటిని బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి మండలాల రైతులకు ఇచ్చిన తరువాతే ఇతర ప్రాంత రైతులకు ఇచ్చే విధంగా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.

ఎంపీ బలరాంనాయక్‌కు వినతి పత్రం అందజేత

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ లోకో మోటివ్ కేంద్రం గాని, వ్యాగన్ వర్క్ షాప్ గాని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ ఆవుల యుగంధర్, జర్నలిస్ట్ అక్రమ్ మంగళవారం వినతిపత్రం అందజేశారు.

సకల కళల సంబురాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సకల కళల సంబురాల జాతర పోస్టర్‌ను నలంద విద్యాసంస్థల అధినేత డాక్టర్ డోలి సత్యనారాయణ, కళాకారులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంలో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు కోసం సకల కళల సంబురాల జాతరను పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో ఈనెల 12, 13 తేదీలల్లో నిర్వహిస్తారన్నారు. ఎంట్రీలకు 98669 51020 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు ప్రసాద్‌రావు, సత్యనారాయణ, కృష్ణప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

యువత అంతర్జాతీయస్థాయికి ఎదగాలి



జవాన్ దంపతులను సన్మానిస్తున్న కృష్ణారెడ్డి

చిన్నగూడూరు: యువత దేశ సేవలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తెలంగాణ ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీ మెంబర్ వల్లూరి కృష్ణారెడ్డి, జయ్యారం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఉషశ్రీ పేర్కొన్నారు. మండలంలోని మంగోరిగూడెం గ్రామానికి చెందిన వీర జవాన్ పిట్టల వీరన్న మన దేశానికి గౌరవంగా ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయస్థాయిలో యూఎన్‌ఓకు ఎంపికై దేశం తరఫున సేవలందిస్తున్నాడు. ఈ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన వీరన్న దంపతులను మంగళవారం మండలంలోని జయ్యారం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానికులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, కొత్త శ్రీను పాల్గొన్నారు.

ఓటరు నమోదు పారదర్శకంగా చేపట్టాలి



పెద్దవంగర: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

పెద్దవంగర: ఓటరు నమోదు ప్రకియను బూత్ లెవల్ అధికారులు పారదర్శకంగా చేపట్టాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం బూత్ స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు సుధాకర్, ఉమేష్ మండల బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఆర్‌ఐ లస్కర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

డోర్నకల్: ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటు బదిలీ, మార్పులు, చేర్పులపై బీఎల్వోలకు మంగళవారం అమ్మపాలెం రైతువేదికలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శిక్షకుడు వీరన్న అవగాహన కల్పించారు.

ఘనంగా సీత్లాభవాని వేడుకలు



మహబూబాబాద్ రూరల్: గుండ్ల బోడుతండాలో మొక్కులు చెల్లిస్తున్న తండావాసులు



గార్ల: సీతంపేటలో..



గూడూరు: మచ్చర్ల గ్రామంలో వేడుకుంటున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్



కురవి: పెద్దతండాలో వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, తదితరులు



మరిపెడ: అమ్మవారి గద్దెల వద్దకు వెళ్తున్న గిరిజన మహిళలు



చిన్నగూడూరు: మేఘ్యాతండాలో..



డోర్నకల్‌లో సీత్లా పండుగ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సీత్లా భవాని వేడుకలను మంగళవారం గిరిజనులు వైభవంగా నిర్వహించారు. పశు సంపదతోపాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని, అదే విధంగా పంటలు సమృద్ధిగా పండి ఎటువంటి రోగాల బారిన పడకుండా అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

- సాక్షి నెట్‌వర్క్

ఏజెన్సీ ఉద్యోగాల చట్టం చేయాలి



మాట్లాడుతున్న ఈసం సుధాకర్

గూడూరు: ప్రభుత్వం 5వ షెడ్యూల్ ప్రకారం 29శాఖలలోని జీఓలను కలుపుతూ ఏజెన్సీ ఉద్యోగాల చట్టం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12వ తేదీన ఆదివాసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కొమురం భీం సెంటర్‌లో ఉదయం 10.30నుంచి సాయంత్రం 4గంటల వరకు నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పడిగ నాగేశ్వర్‌రావు, వజ్జయ్య, మల్లేష్, సునీల్ పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్సార్



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, తదితరులు



మరిపెడ: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



తొర్రూరు: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గూడూరు: గుండెంగలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



బయ్యారం: గంధంపల్లి-కొత్తపేటలో..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా వైఎస్సార్ నిలిచారన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల సత్యం డిమాండ్ చేశాడు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నందీశ్వర్, రవీందర్, నరేందర్, శ్యామ్, రఫిక్, అనిల్ పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలి

గూడూరు: ఏజెన్సీ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ ఆర్.పరుశురాములు కోరారు. జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు

పొలంబాట

పెద్దవంగర: మండలంలోని గంట్లకుంట గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఏఈ రమేష్ బాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నెల్లికుదురుసెంటర్: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు హోలీఫైర్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేసినట్లు మినిస్ట్రీస్ చైర్మన్ జీవీ. ఇజ్రాయేల్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ కందిపాటి రాంబాబు, ట్రస్ట్ వైస్ చైర్మన్ సునీత పాల్గొన్నారు.

విధుల సమయంలో ఫోన్ వాడరాదు

మరిపెడ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల్లో విద్యార్థులకు బోధన చేసే సమయంలో సెల్‌ఫోన్ వాడడం వల్ల అభ్యసన నష్టం జరుగుతుందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు భూక్య ప్రవీణ్‌నాయక్ అన్నారు. బోధన సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడొద్దని తానంచర్ల హైస్కూల్‌లో ఎంఈఓ అనితాదేవిని కలిసి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశాడు.

విద్యుత్ మోటార్ కాపర్ వైర్ చోరీ

కురవి: మండలంలోని కందికొండ గ్రామంలో చిలువేరు నరేష్ అనే కౌలు రైతుకు చెందిన వ్యవసాయ బావి విద్యుత్ మోటార్‌లోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు.

జాగ్రత్తలు పాటించాలి

తొర్రూరు రూరల్: ఖరీఫ్ పంటల సాగులో ప్రతి రైతు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి దుర్గం రాంనర్సయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం, ఖానాపురం గ్రామాల శివారులో వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగును పరిశీలించారు.

గుంత పూడ్చివేత

నర్సింహులపేట: మండలంలోని గోల్‌బొడ్కతండా గ్రామ పంచాయతీ పరిధిలో ధన్‌సింగ్ తండా నుంచి నర్సింహులపేట వచ్చే బీటీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను ఎస్సై గండ్రాతి మంగళవారం సొంత ఖర్చులతో పూడ్చివేశారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను మంగళవారం తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. విద్యార్థుల నమోదును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్య

గూడూరు: నేడు ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యాబోధన జరుగుతుందని హెచ్‌ఎం పులి దేవేందర్ అన్నారు. మండలంలోని సీతానగరం శివారు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

పోరాటాల ఫలితంగానే వేతనాలు

నెల్లికుదురుసెంటర్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ చేసిన పోరాటాల ఫలితంగానే జీపీ వర్కర్స్ వేతనాలు విడుదల అయ్యాయని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి మంగళవారం తెలిపారు.

వైద్యశిబిరం



కురవి: గిరిజనులు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నేతావత్ వెంకన్న అన్నారు. మంగళవారం మండలంలోని సూదనపల్లి శివారు బీబీనాయక్ తండాలో మాజీ సర్పంచ్ బోడ శ్రీను ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరస్వామి, సోనిరాథోడ్, సురేందర్‌నాయక్, మాధవరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

నాయకురాలు ఉదయమ్మ మృతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హరిజనవాడ బీజేపీ సీనియర్ నాయకురాలు పుచ్చకాయల ఉదయమ్మ ఊపిరితిత్తులు సమస్యతో ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో అబులెన్స్‌లో మార్గమధ్యలో సోమవారం రాత్రి మృతి చెందారు. నాయకులు గడ్డం అశోక్, వెన్నమల్ల అజేయ్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

యువజన నాయకుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరుగురు మంత్రులు మానుకోట మండలం సోమ్లతండాలో కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన క్రమంలో యువజన నాయకులు మానుకోట పట్టణంలో బైక్ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, గాంధీ వీరన్న, పడిశాల శ్రీను, పూజరి వెంకటేష్, మట్టి వికాస్ పాల్గొన్నారు.